

నవల

# ఎడారి పూలు

– సలీం –

**EDAARI POOLU Novel**
**(Serialised in Navya Weekly)**
by **Saleem**

First Edition: August, 2018

© Author

For Copies & Address :
**Saleem**
Flat No. B2/206,
Lakshminarayana Apts.,
3-6-164, Himayathnagar,
Hyderabad-500 029.
Ph: 7588630243

Copies: 500

Book Price : Rs. 150/-

Book Publishing Works:
**JV Publications**
jyothivalaboju@gmail.com

Type Setting:
**K. Ravi Prabha**
Cell: 96666 08835

*Printed at:*
**Karshak Art Printers**
Vidyanagar, Hyd.44

*for Copies:*
All Major Book Shops

# ఎడారి పూలు

హైద్రాబాద్ పాత నగరంలోని మొగల్‌పురాలో ఓ ఇరుకు గల్లీ... శుక్రవారం కావడం వల్ల అన్ని ఇళ్ళల్లో ఉషోదయానికి ముందే సందడి మొదలైంది. అమ్మతో పాటు జుబేదా కూడా ఉదయాన్నే లేచి తలంటిస్నానం చేసింది. జుట్టు తొందరగా ఆరడానికి వాళ్ళమ్మ ఇచ్చిన పాత దుపట్టాని తలకు చుట్టుకుంది. జానిమాజ్ పరచి అమ్మతో కలిసి ఫజ్జర్ కా నమాజ్ చేసింది. ఖురాన్ పఠనానికి ఉస్తాద్‌బీ వాళ్ళింటికెళ్ళే సమయం కావటంతో తనకున్న రెండు చుడీదార్లలో ఏది మెరుగ్గా ఉందా అని ఒకటికి రెండుసార్లు తిప్పి తిప్పి చూసుకుంది. రెండూ పాతబడ్డవే. ఒకటిరెండు చోట్ల చిరుగులుకూడా పడ్డాయి. వాటిలో చిన్నచిన్న గులాబీపూల డిజైన్ ఉన్న చుడీదార్ అంటే తనకు చాలా ఇష్టం. పోయిన రంజాన్ పండక్కి అమ్మ కొనిచ్చిన చుడీదార్ అది. దాన్ని తొడుక్కుని, తల దువ్వుకుని జడ వేసుకుంది.

"అమ్మా.. తొందరగా నాష్టా పెట్టు. ఇప్పటికే ఆలస్యమైంది. ఉస్తాద్‌బీ కోప్పడతారు" అంది వంట గదిలోకెళ్ళి అమ్మకెదురుగా పీట వాల్చుకుని కూచుంటూ.

"నాష్టాలు తినే అదృష్టం కూడానా మన బతుకుల్లో.. కొద్దిగా చద్దన్నం ఉంది. పచ్చడి వేసుకుని తినెళ్ళు" అంది అమ్మ.

జుబేదా గునుస్తూనే కంచంలో అమ్మ పెట్టిచ్చిన అన్నంలో చింతకాయ పచ్చడి కలుపుకుని తింది. ఆ అన్నం గుప్పెడు కూడా లేనందువల్ల ఇంకా ఆకలిగానే అన్పించింది. 'ఇంకొద్దిగా పెడ్తావా' అనేలా మొహంపెట్టి అమ్మవైపు చూసింది. అమ్మ మొహంలో కన్పించిన అనంతమైన దిగులు జవాబుగా లభించగానే కంచంలో చేయి కడుక్కుని లేచింది.

"బురఖా వేసుకోకుండా వెళ్ళేవు. మీ అబ్బాకు తెలిస్తే కోప్పడతాడు" వంట గదిలోంచే వాళ్ళమ్మ జుబేదాకు విన్పించేలా చెప్పింది.

"ఏది మర్చిపోయినా అది మాత్రం మర్చిపోనులే అమ్మీ" అని, నల్లటి బురఖాని తొడుక్కుంది. మొహాన్ని నఖాబ్‌లో దాచేసి కళ్ళ దగ్గరున్న ఖాళీలోంచి చుట్టూ పరికించి చూసింది. ఖురాన్ నిన్న తను పెట్టిన చోట లేదు.

"మా.. ఖురానే షరీప్ కన్పించడం లేదు" అంటూ అమ్మని కేకేసింది.

ఆమె విసుక్కుంటూ వచ్చి "వెతుక్కోవచ్చుగా. పెద్దదానివయ్యావు. పది హేనేళ్ళు వచ్చాయి. ఖురాన్‌ని ఎక్కడంటే అక్కడ పెట్టకూడదని ఎన్నిసార్లు చెప్పాను? నిన్న కూడా అలానే మంచం మీద పెట్టావు. దాన్ని భద్రంగా పరిశుభ్రమైన ముఖమల్ గుడ్డలో చుట్టి పెట్టాలనీ, చదువుకునేటప్పుడు రెహాల్లో పెట్టి చదువుకోవాలనీ చెప్పాగా" అంటూ ఖురాన్ ప్రతిని తీసి కూతురి చేతిలో పెట్టింది.

జుబేదా నవ్వుతూ దాన్ని చేతుల్లోకి తీసుకుంటూ "అమ్మీ.. నాకు పదిహేనేళ్ళు కాదు. పధ్నాలుగే" అంది.

"ఏమోలే తల్లీ... నీకున్నంత తెలివి నాకెక్కడిది?" అంది ఫాతిమా కూడా నవ్వుతూ.

కూతురంటే ఆమెకెంతిష్టమో... కూతురి అందమైన నవ్వంటే మరీ ఇష్టం. చౌథమీ కా చాంద్ తన వెన్నెలంతా నేలమీదికి ఒలకబోసినట్లు ... తీయటి ఖీర్

గొంతులోకి జారుతున్నట్లు... నవ్వు... జుబేదా ఆమెకు మొదటి సంతానం. మగపిల్లాడ్ని కనకుండా ఆడపిల్లను కన్నందుకు భర్త కరీం చేతిలో ఎన్ని తన్నులు తిందో ఆ అల్లాకే తెలుసు. జుబేదా తర్వాత ఇద్దరు మగ పిల్లలు ... నాలుగో సంతానం మళ్ళా ఆడపిల్లే.. నూర్జహా... దానికిపుడు ఎనిమిదేళ్ళు. నూర్జహా తర్వాత మరో పిల్లాడు. వాడికి ఆరేళ్ళు.

జుబేదాకి పదేళ్ళు వచ్చేవరకు మొగల్‌పురాలోనే ఉన్న ఆడపిల్లల మదరసాకు పంపించారు. అక్కడే ఉర్దూ అరబ్బీ నేర్చుకుంది. ఖురాన్‌ని చదవడం నేర్చుకుంది. అక్కడ చదువు నేర్పేది మగవాళ్ళే. ఆడ ఉస్తాద్‌బీలు ఉండరు. అందుకే పిల్ల ఈడేరక ముందే అక్కడ చదివించడం మాన్పించేశారు. వీళ్ళుండే గల్లీకి రెండు గల్లీలవతల ఉండే బీబీజాన్ తమ యింట్లోనే ఆడపిల్లలకు ఖురాన్ చదివిస్తుందని తెలుసుకుని రెండేళ్ళ నుంచి జుబేదాని అక్కడికి పంపిస్తున్నారు.

ఏపుగా అందంగా ఎదుగుతున్న జుబేదాని చూసినపుడల్లా ఆమెలో సంతోషం కన్నా దిగులే ఎక్కువగా కలుగుతూ ఉంటుంది. పిల్ల పెళ్ళెలా చేయాలన్నదే ఆమెను ప్రస్తుతం పీడిస్తున్న సమస్య. జీవితం ఇంత దుర్భరంగా ఉంటుందని ఆమెకు పెళ్ళికి ముందు తెలియదు. నిఖా అయ్యేనాటికి ఆమెకు పదిహేనేళ్ళు. స్వంతూరు కరీంనగర్. తనూ, చెల్లి, అమ్మ ... ముగ్గురూ యింట్లోనే బీడీలు చుట్టేవారు. కబుర్లు చెప్పుకుంటూ బీడీలు చుడ్తుంటే శ్రమే తెలిసేది కాదు. ఉండేది చిన్న రేకుల షెడ్డులోనైనా అది స్వంతిల్లు కాబట్టి అద్దె యిళ్ళలో ఉండేవాళ్ళ కష్టాలేమిటో ఆమెకు తెలియదు.

పదిహేనో యేట తండ్రి ఓ సంబంధం తెచ్చాడు. 'కుర్రాడికి ఇరవై రెండేళ్ళు. చామన ఛాయైనా చూట్టానికి చక్కగా ఉంటాడు. నాతోపాటు ఫ్యాక్టరీలో పన్చేసే ఖలీల్ లేడూ... అతని పెద్ద కొడుకు. కరెంటు వైరింగ్ పని చేస్తాడు. బాగానే సంపాదిస్తున్నాడని విన్నాను. పెళ్ళయితే హైద్రాబాద్ వెళ్ళి ఏదైనా కరెంట్ కాంట్రాక్ట్ పనులు చేసుకుని బాగా డబ్బులు సంపాయించాలని అతని కోరికట. ఖలీల్ చెప్పాడు' అంటూ  నాన్న అమ్మతో చెప్తుంటే విని కలల్లో తేలిపోయింది.

పెళ్ళయ్యాక తెలిసింది తను కన్న కలలన్నీ కేవలం కలలే అని... అవి ఎన్నటికీ నిజాలయ్యే అవకాశమే లేదని. కరీం ఎలా ఉంటాడో తెలీకుండానే నిఖా జరిగిపోయింది. సుహాగ్ రాత్ రోజు కరీంని చూసి అనంతమైన నిరాశకు

లోనయింది. తన కలల్లో మెదిలిన రాకుమారుడు కాదతను... తన నాజూకైన శరీరాన్ని ఏ స్పందనలూ లేని శిలలా మార్చే మాంత్రికుడని ఆ క్షణమే అర్థమైంది. అందంగా లేకున్నా పర్లేదు  మంచివాడైతే చాలనుకుంది. ఆ కోరికా తీరలేదు. కరీం ఎంత దుర్మార్గుడో అనుభవంలోకి వచ్చేకొద్దీ ఆమె మరింతగా తనలోకి తను ముడుచుకుపోయింది. మంచివాడు కాకున్నా పర్లేదు నా నుదుట అల్లా రాసిపెట్టిన షొహర్ ఇతనే అని సరిపెట్టుకుంటాను అనుకుంది. కనీసం తనకూ తన పిల్లలకు రెండు పూటలా తిండి పెట్టగలిగితే చాలనుకుంది. అక్కడా ఆమెకు నిరాశే ఎదురైంది. అతని నాన్న చెప్పినవన్నీ అబద్ధాలే. కరీంకి కరెంటు పనిలో ప్రావీణ్యం ఏమీ లేదు. ఫ్యూజ్ పోతే వేయడం, సీలింగ్ ఫ్యాన్ బిగించడం లాంటి పనులు తప్ప కరెంటు వైరింగ్ పని చాతకాదు,

ఫాతిమా కష్టాలు అక్కడితో తీరిపోలేదు. 'ఒక పూట తిండితోనే సరిపెట్టుకుని, పిల్లల్ని చూసుకుంటూ వాళ్ళకోసం ప్రాణాలు నిలుపుకుని బతికేస్తాను' అనుకుంది. మొగల్‌పురాలో ఓ యిల్లు అద్దెకు తీసుకుని కాపురం పెట్టాక అతని పైన తల్లి దండ్రుల అజమాయిషీ కూడా లేకపోవడంతో మరీ అధ్వాన్నంగా తయారయ్యాడు. సంపాయించిన కాసిని డబ్బులు కూడా యింట్లో ఇవ్వకుండా జల్సాలకు ఖర్చు చేయడం మొదలెట్టాడు.

ఇంటి ఖర్చులకు డబ్బులివ్వమని తను పోరుపెట్టినపుడల్లా వంటిమీద వాతలు తేలేలా కొట్టేవాడు. అవీ భరించింది. రెండేళ్ళ క్రితం ఆమె జీవితంలో పిడుగు పాటులా కరీం రెండో పెళ్ళి చేసుకుని తనకు సౌతన్‌ని తెచ్చాక ఆమె మానసికంగా పూర్తిగా చచ్చిపోయింది.

ఆమె ఆలోచనల్ని భంగం చేస్తూ చిన్న పిల్ల నూర్జహాన్ "అమ్మీ...ఆకలేస్తోంది" అంటూ వచ్చింది.

✦ ✦ ✦

**బీబీ**జాన్ తన ఎదురుగా కూచుని ఉన్న ఆరుగురు ఆడపిల్లల చేత ఖురాన్‌ని వల్లె వేయిస్తోంది. యాస్మిన్ తప్ప మిగతా అందరూ పన్నెండేళ్ళనుంచి పదహారేళ్ళ మధ్య వయస్కులే. నల్లటి బురఖాలు తీయకుండానే మొహాలకు అడ్డంగా ఉన్న నఖాబ్‌ని తొలగించి, తలలు వంచుకుని శ్రద్ధగా వల్లె వేస్తున్నారు. బీబీజాన్ వాళ్ళ మొహాలవైపు  అరేబియన్ దేశపు పందెపు గుర్రాల్ని కొనడానికి ఉత్సాహపడే బేహారిలా పరీక్షగా చూసింది.

ఆమె కళ్ళకు జుబేదా ఆరుగురిలోకి అందగత్తెలా కన్పించింది. ఈ ఆరుగురిలోనే కాదు చుట్టుపక్కల ఉన్న మొహల్లాల్లో ఈడేరిన అమ్మాయిలందర్లోకి జుబేదా సౌందర్యవతి అన్పించింది. విరిసిన తెల్లగులాబీల్లా మురిపించే కళ్ళు... గుసగుసలుగా తీపి కబుర్లేవో చెప్తున్నట్టు కదిలే తేనెలొలికే పెదాలు... కొనదేలిన చుబుకం ... కోటేరు ముక్కు... కాశ్మీర్ యాపిల్ పండులా మెరిసే బుగ్గలు...

జుబేదా అంతకాకున్నా రెహనా కూడా అందగత్తే. జుబేదా కంటే ఓ ఏడాదో రెండేళ్ళో పెద్దదయి ఉంటుంది. కళ్ళు మందారపూవ్వల సోయగాన్ని నింపుకుని... కాటుక దిద్దడంవల్ల మరింత వెడల్పుగా కన్పిస్తున్నాయి. ఏ చిత్రకారుడో తీర్చిదిద్దినట్టుండే పెదవులు... మిగతా పిల్లల్లో పదిహేడేళ్ళ యాస్మిన్ ఉన్నా అందంగా ఉండదు. చామనఛాయ.. చిన్న కళ్ళు... వాటిలో విషాదం పేరుకుపోయి చీకటి కమ్మేసినట్టు నిస్తేజంగా ఉంటాయి.

అక్కడి మొహల్లాల్లో ఉండే ముస్లింలందరూ పేదవాళ్ళే... బీద, అతి బీద, కడు బీద లాంటి స్థాయీ భేదాలు తప్ప మూడు పూటలా కడుపునిండా తిండి తినే కుటుంబాలు మచ్చుకి కూడా కానరావు. ఐనా జుబేదా మొహంలో కానీ, రెహనా మొహంలో కానీ పేదరికపు ఆనవాళ్ళు కన్పించవు. జన్నత్ కీ పరీలు శాపవశాన పేద కుటుంబంలో పుట్టినట్టు... పర్షియన్ రాజకుమార్తెల హుందాతనం, శరీర లావణ్యం, సౌకుమార్యం పుణికి పుచ్చుకున్నట్టు... అందానికి అర్థంలా... అపరంజి బొమ్మల్లా ఉంటారు.

తనో నిర్ణయం తీసుకునేముందు వాళ్ళ మొహాల్తోపాటు అంగ సౌష్ఠవాన్ని కూడా పరిశీలించడం అవసరమనుకుంది. పైన ఫ్యాన్ తిరుగుతున్నా గాలి ఆడనట్టు చేత్తో విసురుకుంటూ “అబ్బా.. ఎంత ఉక్కగా ఉందో...అవునూ నాకు తెలీకడుగుతాను. నేనూ ఆడదాన్నేగా. నాముందు కూడా బురఖాలు దేనికి? తీసేసి కూచుంటే గాలైనా ఆడుతుందిగా” అంది అందర్నీ ఉద్దేశించి.

దానికి సమాధానంగా యాస్మిన్ సిగ్గుపడుతూ “నిజమే ఉస్తాద్‌బీ... కానీ మధ్యమధ్యలో చాచాజాన్ వస్తుంటారుగా” అంది.

బీబీజాన్‌కి వాళ్ళ అభ్యంతరమేమిటో అర్థమైంది. ఆమె భర్త గౌసుద్దీన్ ఫంక్షన్ హాల్లో పనిచేస్తాడు. పని లేనప్పుడు ఇంట్లోనే వేలాడుతుంటాడు. వయసులో ఉన్న ఆడపిల్లలున్నారన్న ఇంగితం కూడా లేకుండా ఏదో ఓ మిష మీద లోపలికొచ్చి

అమ్మాయిల మొహాల్ని కళ్ళతో తడిమి వెళ్తుంటాడు. ఎన్నిసార్లో మందలించింది అలా లోపలికి రావడం తప్పని... వెకిలిగా నవ్వి 'అరవిరిసిన పూలని చూడాలనుకోవడంలో తప్పేమిటి?' అంటూ వాదిస్తాడు.

"సరే. ఈ రోజు నుంచి మీ చాచాజాన్ లోపలికి రాకుండా తలుపు గడియపెట్టేస్తాను. మీరు పాఠాలయ్యాక వెళ్ళేముందు బురఖాలు తొడుక్కున్నాకే గడియతీస్తాను" అంటూ లేచి తలుపుకి గడియపెట్టొచ్చి కూచుంది.

ఆడపిల్లలు ఒకరిమొహాలు మరొకరు చూసుకుని చివరికి ఏం చేయాలన్నట్టు యాస్మిన్ వైపు చూశారు. యాస్మిన్ వాళ్ళకంటే వయసులో పెద్దది కావడంతోపాటు వాళ్ళకు నాయకురాలిలా వ్యవహరిస్తో ఉంటుంది. మొదట యాస్మిన్ లేచి బురఖా తీసేసి మడతలుపెట్టి పక్కనేఉన్న ప్లాస్టిక్ కుర్చీమీద పెట్టింది. వయసులో చిన్నవాళ్ళయిన ముగ్గురమ్మాయిలు బురఖా విప్పదీశాక, రెహనా లేచి తన బురఖాని తీసి కుర్చీకున్న కోడుమీద పెట్టింది.

బీబీజాన్ రెహనా శరీరాకృతి మీద దృష్టి సారించింది. దాదాపు ఐదడుగుల నాలుగంగుళాల పొడవు... తాళ్ళ ఆసరాతో పైకిపాకుతున్న బీరతీగెలా నాజూకైన వొళ్ళు... సన్నటి నడుము... బంగారంలా మెరిసే చర్మం... నిండుగా ఎదిగి కనువిందు చేస్తున్న స్త్రీత్వపు లక్షణాలు...బీబీజాన్ తృప్తిగా తలపంకించింది.

అందరూ బురఖా విప్పినా ఇంకా బురఖాతోనే కూచుని ఉన్న జుబేదా వైపు కొద్దిగా విసుగ్గా చూస్తూ "బురఖా విప్పడానికి సిగ్గెందుకు? లోపల బట్టలున్నాయిగా. తొందరగా కానీయ్. నీ వల్ల పాఠం ఆగిపోయింది" అంది.

"నాకేమీ ఉక్కబోయడం లేదు ఉస్తాద్‌బీ. పైపెచ్చు చలిగా కూడా ఉంది. నాకిలానే బావుంది" అంది జుబేదా.

"నీతోటి అమ్మాయిలందరూ బురఖా తీసేసి కూచుంటే నువ్వు బురఖాతో కూచోవటం ఏమైనా బావుందా చెప్పు? నా మాటిను. ఈ రోజు నుంచి మీరు లోపలికి రాగానే బురఖా తీసేసి కూచోవాలి. అది నియమం."

"రేపటినుంచి తీసేస్తాను ఉస్తాద్ బీ."

"కుదరదు. నువ్వేమైనా పైనుంచి దిగొచ్చావా? అందరితో పాటే నువ్వు" కోపంగా అంది.

జుబేదా ఇబ్బందిగా ఆమె వైపు చూసింది. ఆమె కళ్ళలో తను ఎప్పుడూ చూడని కాఠిన్యం.. ఆ అమ్మాయికి చప్పున భయమేసింది. మెల్లగా లేచి బురఖా తీస్తున్నప్పుడు అనాయాసంగానే కళ్ళల్లో నీళ్ళూరాయి. బురఖాని కుర్చీకున్న మరో కోడుమీద వేశాక తన డ్రెస్‌కున్న చిరుగుల్ని చేతుల్తో కప్పుకునే ప్రయత్నం చేస్తూ ముడుచుకుని కూచుంది.

బీబీజాన్ కళ్ళు ఆ అమ్మాయి శరీరాన్ని ఆత్రంగా శల్యపరీక్ష చేశాయి. ఎంతందంగా ఉందీ అమ్మాయి! ఎంత అద్భుతమైన ఒంపుసొంపులో! చక్కెర, తేనె, పాలు కలిపి దాన్లో వెన్నెలని రంగరించి అల్లా మరింత శ్రద్ధగా చేసినట్టున్నాడు అనుకుందామె. జుబేదా కూడా దాదాపు రెహనా అంత ఎత్తుంది. ఆమె కళ్ళకు జుబేదా, రెహనా కాసుల వర్షం కురిపించే కన్నె దేవతల్లా కన్పించారు. తన భర్త గౌసుద్దీన్ చెప్పిన ప్లాన్ అమలు పర్చడానికి ఆమె సమాయత్తమైంది. ఈ దెబ్బతో తమ పేదరికం మొత్తం తుడిచిపెట్టుకుపోవాలి. పెద్దయిల్లు, సోఫా సెట్లు, టీవీలు, ఫ్రిజ్జులూ, కార్లు... ఆమె కళ్ళ ముందు నాట్యం చేయసాగాయి.

కొన్ని నిమిషాల క్రితం ఎర్రజీరల్ని నింపుకున్న కళ్ళు ఇపుడు ప్రేమగా తన వైపు చూస్తుండటంతో జుబేదా విస్మయానికి లోనయింది,

“ఇందుకేనా బురఖా తీయనన్నావు? మన కుటుంబాలన్నీ పేదరికంలో మగ్గుతున్నవే. చిరుగులకు సిగ్గుపడటం దేనికి? మనం ఆలోచించాల్సింది ఈ పేదరికం నుంచి ఎలా బైటపడాలా అని. నీకు లేదా చెప్పు ఏ పూటకాపూట తిండి వెతుక్కునే దుర్భరమైన దారిద్ర్యంలోంచి బైటపడి విలాసవంతమైన జీవితం గడపాలని? ఖరీదైన బట్టలు, వంటినిండా నగలు, మెత్తటి పరుపులు, కోరిన తిండి, కోటలాంటి ఇల్లు...”

ఆమె మాటలు వింటున్న ఆడపిల్లల కళ్ళు ఆశగా మెరవడం బీబీజాన్ తృప్తిగా గమనించింది. తనూ, తన భర్తా వేసిన పథకం చాలా సులభంగా నెరవేరుతుందన్న నమ్మకం కలిగిందామెకు. ఆ రాత్రంతా ఆమె కలల నిండా జలజలా రాలిపడ్తూ నోట్ల కట్టలు ...

✦ ✦ ✦

**ఉ**దయం లేచినప్పటినుంచి జుబేదా ఉత్సాహంగా పనులు చేస్తోంది. చెల్లెలు నూర్జహాన్‌కి తనే తలంటి స్నానం చేయించింది. జుట్టు ఆరాక సాంబ్రాణీ ధూపం వేసింది. జడ అల్లుతూ ‘నాలానే నా చెల్లిది పొడవాటి ఒత్తయిన జుట్టు’ అనుకుంది.

ఎంత ఉత్సాహపరుస్తున్నా దిగులుగా మొహం పెట్టుకుని కూచున్న చెల్లితో "ఈ రోజు నీ పుట్టిన రోజు కదా. సంతోషంగా ఉండాలి. ఈ రోజు ఎలా ఉంటే ఏడాది పొడుగూతా అలానే ఉంటారట తెలుసా? నీకు సాల్‌గిరా ముబారక్ చెప్పడానికి నా సహేలీ రెహనా కూడా వస్తానంది తెలుసా" అంది.

నూర్జహా కళ్ళల్లో నీళ్ళూరాయి. "ఆపా... నా పుట్టిన రోజు కదా. మరి ఇప్పటివరకూ అబ్బా రాలేదు చూశావా? నువ్వే చెప్పావుగా. అబ్బా వచ్చాక నాకు కొత్త గౌన్ కొనిస్తాడని.. సాల్‌గిరా రోజు కూడా ఈ పాత గౌనేనా? నాకొద్దు. నాకసలు సాల్‌గిరానే వద్దు" అంది.

"వస్తాడు చెల్లీ. నాన్న ఈ రోజు తప్పకుండా వస్తాడు. నిన్నంతా రాలేదు కదా. ఎందుకనుకున్నావు?ఈ రోజు నీ సాల్‌గిరా అని నాన్నకు బాగా గుర్తుండి ఉంటుంది. మన ఐదుగురిలోకి నువ్వంటేనే కదా నాన్నకు చాలా ఇష్టం" చెల్లెలి కన్నీళ్ళు తుడుస్తూ అంది.

"లేదు. నాన్నకు నేనంటే ఇష్టం లేదు. నేనంటే ఎవ్వరికీ ఇష్టం లేదు" నూర్జహా అలిగి ఓ మూలకెళ్ళి ముడుచుకుని కూచుంది.

"నువ్వు మా బుజ్జి చెల్లివి కదా. ఇంట్లో అందరికీ నువ్వంటే బోలెడు ఇష్టం. నీకిష్టమనేగా అమ్మ నీ కోసం సగ్గుబియ్యంతో ఖీర్ చేసింది. మొదట ఖీర్ తిందాం రా. ఈ లోపల నాన్న వచ్చేస్తాడు."

"నేను ఖీర్ తినను. అసలు అన్నమే తినను. నాన్న వచ్చేవరకు నాకేమీ వద్దు."

"రెండ్రోజుల క్రితం నాన్న మనింటికి వచ్చినపుడు నీ సాల్‌గిరాకు కొత్త గౌన్ కొనమని నేను సిఫారస్ చేశాగా. అబ్బా కూడా తప్పకుండా కొంటానన్నాడుగా. నా ఉద్దేశంలో గౌన్ కొనడం కోసమే చార్మినార్ దగ్గరున్న షాపుకెళ్ళి ఉంటాడు. పదయితే గాని షాపులు తెరవరుగా. అందుకే ఆలస్యం" చెల్లిని బుజ్జగించే ప్రయత్నం చేస్తూ అంది.

ఆ మాట వినగానే నూర్జహా కళ్ళలోకి వెలుగు ప్రవేశించింది. "నిజమా ఆపా?" అంది.

"నిజం చెల్లీ."

“మరి ఇప్పుడు టైం ఎంతయింది?”

టైం చూడటానికి వాళ్ళింట్లో గోడగడియారం లేదు. కరీం చేతికి మాత్రమే వాచీ ఉంటుంది. సమయం పది దాటి ఉంటుందని తెల్సినా, జుబేదా యింటి బైటికొచ్చి కళ్ళపైన అరచేతిని అడ్డుపెట్టి ఆకాశం కేసి చూసి, విప్పారిన మొహంతో లోపలికెళ్ళి “తొమ్మిది కూడా కాలేదు చెల్లీ” అంది.

అప్పుడే రెహనా లోపలికొచ్చి “సాల్‌గిరా ముబారక్ నూర్జహా” అంది. ఆమె చేతిలో మెహందీ పెట్టే కోన్ కన్పించగానే “ఆపా.. మెహందీ నాకోసం తెచ్చావా?” అంది సంతోషంగా.

“ఔను. నీ పుట్టినరోజునాడు నా తోఫా ఇది. నీ అరచేతులు తెల్లగా మల్లెపూలలా ఉంటాయి కదా. గోరింటాకు పెట్టుకుంటే అవి తెలుపు ఎరుపు రేకులున్న గుల్‌మొహర్ పూలలా అందంగా కన్పిస్తాయి. అందుకు తెచ్చాను” అంది రెహనా.

“ఆపా పెట్టవా?” నాన్నరాని విషయం, కొత్త గౌన్ లేని విషయం మర్చిపోయి నూర్జహా సంతోషంగా రెండు చేతులు ముందుకు చాపింది.

“ఇప్పుడు కాదు. మొదట మనం ముగ్గురం అమ్మీ చేసిన ఖీర్ తిందాం. ఆ తర్వాత మెహందీ... సరే నా” అంది జుబేదా.

“సరే ఆపా” అంటూ లేచి తూనీగలా వంటగదిలోకి పరుగెత్తింది నూర్జహా.

“షుక్రియా రెహనా. ఇందాకటినుంచీ అది అలిగి కూచుంది. ఎంత బతిమాలినా విన్లేదు. నీ చేతిలో మెహందీ కోన్ చూశాక దాన్లో ఉత్సాహం వచ్చింది” స్నేహితురాలి భుజాల చుట్టూ ఆప్యాయంగా చేతులు వేస్తూ అంది.

“ఎందుకలిగింది?”

“తన సాల్‌గిరాకి నాన్న కొత్త డ్రెస్ తీసుకురాలేదని ఏడుస్తోంది. ఎలా ఓదార్చాలో నాకూ అమ్మీకి అర్థం కావడం లేదు”

“అవునూ ఇంతకీ చాచా ఏడీ?”

జుబేదా ఉదాసీనంగా మారిపోయింది. “నీకు తెలియంది ఏముంది రెహనా. నువ్వు నా జిగరీ దోస్తువి. మా యింటి విషయాలు నీకు తెలుసు. నాన్న యింటికొచ్చి

రెండు రోజులైంది. చెల్లి సాల్‌గిరా మర్చిపోతాడేమోనని నేనారోజు మరీమరీ చెప్పాను. తప్పకుండా వస్తానన్నాడు. వచ్చేటపుడు దానికి కొత్త గౌన్ తెస్తానన్నాడు. చూశావా ఇప్పటివరకు రాలేదు" జుబేదా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఏడ్వకే. మన ముస్లిం ఆడవాళ్ళ బతుకులన్నీ ఇంతేగా. కొత్తేముంది? మన చుట్టుపక్కల ఎన్ని ఇళ్ళల్లో చూడటం లేదూ... మగవాడు నలుగురు భార్యల్ని కలిగి ఉండవచ్చని చెప్పినపుడే మన బతుకుల్లో నిప్పులు పడ్డాయి. ఏం చేస్తాం చెప్పు. అంతా మన ఖర్మ"

"మమ్మల్ని పోషించే స్థోమతే లేనపుడు మరొకదాన్ని నిఖా చేసుకోవడం ఎంతవరకు న్యాయం? అమ్మీనే లేకపోతే మా బతుకులేమయ్యేవో... ఆమె రెక్కలు ముక్కలు చేసుకుంటేనే మాకో పూట గంజి దొరుకుతోంది. తమ్ముళ్ళిద్దరూ హాయిగా ఆడుకుంటూ, బళ్ళో చేరి చదువుకుంటూ ఉండాల్సిన వయసులో వళ్ళు హూనం చేసుకుని పనిచేయటం వల్ల మాకు మరోపూట సుక్కీ రోటీ అయినా కడుపులో పడ్తోంది. మా అమ్మీ కన్నీళ్ళు చూస్తుంటే గుండె తరుక్కుపోతుందే" అంది జుబేదా.

ఫాతిమా రెండు చిన్న గిన్నెల్లో ఖీర్ తెచ్చివ్వడంతో వాళ్ళ మాటలు మధ్యలోనే ఆగిపోయాయి. ఖీర్ తినడం పూర్తయ్యాక ముగ్గురూ చేతులకు గోరింటాకు పెట్టుకోవడంలో నిమగ్నమైపోయారు.

ఫాతిమా యాంత్రికంగా వంట చేస్తున్నా ఆమె మనసులో భయంకరమైన తుఫాను చెలరేగుతోంది. బాధల్ని భరించడానికి కూడా ఓ హద్దంటూ ఉంటుంది. ఎన్ని అవమానాలని సహిస్తుంది తనైనా? ముస్లిం ఆడదానిగా పుట్టడమంటే వూహ తెల్సినప్పటినుంచీ దు:ఖాల్ని మోస్తూ బతకడమేనా? పిల్లలకు కన్పించకుండా ఆమె చాలా సేపటినుంచి ఏడుస్తూనే ఉంది.

కరీం బద్ధకస్తుడనీ, తిని తిరగడం తప్ప ఏదో ఓ పనిచేసి డబ్బు సంపాదించడం మీద ధ్యాస ఉండదనీ ఫాతిమాకు పెళ్ళయిన కొన్ని నెలలకే అర్థమైంది. అత్తతో మొరపెట్టుకుంటే 'పెళ్ళయితే బలాదూర్‌గా తిరగడం మానుకుని బుద్ధిగా ఉంటాడనుకుంటే తిని కూచోటం ఇంకా ఎక్కువైంది ఫాతిమా. నువ్వే వాణ్ణి దారిలోకి తెచ్చుకోవాలి' అంటూ బరువంతా తన నెత్తిమీద పెట్టేసింది. హైద్రాబాద్ మకాం మారుద్దామని కరీం అన్నపుడు, వూరు మారితే అతన్లో మార్పొస్తుందేమో నన్న ఆశతో ఒప్పుకుంది. అయినా అతన్లో ఏ రకమైన మార్పూ రాలేదు.

పిల్లలు పుట్టడంతో ఖర్చులూ పెరిగాయి. 'ఏ పనీ చేయకపోతే ఎలాగండీ? పిల్లల్ని పోషించాలి కదా. వాళ్ళను కన్నాక అది మన బాధ్యత కదా' అంది.

'ఏ పనీ చేయడం లేదా? నీకు పిల్లల్ని ఇస్తున్నాగా' అంటూ వంకరగా నవ్వాడు.

'వాళ్ళకి కడుపునిండా తిండి పెట్టాలిగా.'

'వాళ్ళకు నేను పెట్టడమేంటి? వాళ్ళను కన్నదే ఏదో ఓ పని చేసి మనల్ని పోషిస్తారని. పెద్దపిల్ల  జుబేదా ఈడేరటం ఆలస్యం లక్షకు తక్కువ కాకుండా మెహర్ తీసుకుని దాని నిఖా చేస్తాను. నా కూతురు చాలా అందంగా ఉంటుంది కదా. ఏ రయీస్‌కో ఇచ్చాననుకో. లక్షం ఖర్మ రెండు లక్షలైనా కళ్ళకద్దుకుని ఇస్తాడు. మగపిల్లలిద్దర్నీ ఏదైనా పనిలో పెడ్తా. ఇంక నాకేం దిగులు చెప్పు. జల్సాగా జీవితాన్ని అనుభవిస్తా' అంటూ పెద్దగా నవ్వాడు.

చార్మినార్ దగ్గర లాడ్‌బజార్లో రంగురంగుల రాళ్ళు పొదిగిన రకరకాల గాజులు దొరుకుతాయి. హైద్రాబాద్‌వాసులే కాకుండా దేశవిదేశాల నుంచి వచ్చే యాత్రికులు కూడా ఈ గాజుల్ని మోజుపడి కొనుక్కుంటారు. తమ మొహల్లాలో ఉండే బాబూమియా ఓ గాజుల దుకాణంలో పని చేస్తున్నాడు. 'యింట్లో గడవడం కష్టంగా ఉంది. మగపిల్లలిద్దరికీ ఏదైనా పని ఇప్పించు' అని అతన్ని బతిమాలుకుంది.

'చిన్నపిల్లలు కదా చాచీ... మా దుకాణంలో వాళ్ళు చేయగల పని ఏముంటుంది?' అన్నాడు.

'ఏదో ఒక పనిలో పెట్టు బాబూ' అంది.

బాబూమియా కొన్ని క్షణాలు ఆలోచించి, 'మా సేఠ్ యింట్లోనే ఓ గదిలో గాజులు తయారుచేస్తారు. అక్కడ ఏదైనా పన్లో పెట్టుకుంటారేమో అడిగి చూస్తాను' అన్నాడు.

అతని సిఫారసు వల్లనే పిల్లలిద్దరికీ పని దొరికింది. గాజులకు రంగురంగుల రాళ్ళను అతికే పని.. అటువంటి పని తను ఇంట్లోఉండి చేయడానికి అవకాశం ఉందేమో కనుక్కోమంది. తనకు అప్పటివరకు తెలియదు. లాడ్ బజార్ చుట్టుపక్కల ఉండే ముస్లిం మహిళలకు అదే జీవనాధారమని. బాబూమియా చేతికిచ్చి

గాజుల్తోపాటు రంగురాళ్ళని పంపిస్తాడు షాపు యజమాని. వాటితోపాటు మోడల్‌గా రాళ్ళు పొదిగిన ఓ గాజుని కూడా పంపిస్తాడు. తనూ, జుబేదా కలసి అలానే మిగతా గాజుల్లో కూడా రాళ్ళు పొదిగి మరునాడు తిప్పి పంపుతారు. మొదట్లో రోజుకి వంద రూపాయలు ఇచ్చేవారు. తను చేస్తున్న పనిని మెచ్చి ముత్యాలు పొదగాల్సిన గాజులూ, ఖరీదైన రాళ్ళు పొదగాల్సిన గాజులు కూడా పంపడం మొదలెట్టాక ఇపుడు రోజుకి నూటయాభై రూపాయల కూలీ దొరుకుతోంది.

ఏదో విధంగా రోజులు గడిచిపోతున్నాయని అనుకుంటుంటే ఓ రోజు బాబూమియానే ఓ వార్త మోసుకొచ్చాడు. కరీం మరో స్త్రీని నిఖా చేసుకుని మలక్‌పేటలో కాపురం పెట్టాడని. అమ్మకు బాగులేదనో, నాన్నకు బాగులేదనో ఏదో ఓ సాకుచెప్పి తన భర్త వారంలో మూడ్నాలుగు రోజులు కరీంనగర్ కెళ్తుంటే తను నిజమే కామోసనుకుంది. సంపాదించి పెళ్ళాం పిల్లల్ని పోషించే విషయంలో శ్రద్ధ లేకున్నా ముసలి వయసులో తల్లిదండ్రులకు సేవ చేస్తున్నాడని సంతృప్తి పడింది. తనకు తన పిల్లల్ని పోషించుకోడమే భారంగా అన్పిస్తున్న సమయంలో వాళ్ళని యింటికి పిల్చుకొచ్చి తనపైన మరింత భారం మోపనందుకు సంతోషపడింది.

బాబూమియా చెప్పేవరకు తన భర్త తనకు తెలియకుండా మరో నిఖా చేసుకుని వారంలో నాలుగురోజులు అక్కడ గడుపుతున్నాడనే వూహ కూడా ఎప్పుడూ రాలేదు. బాబూమియాకి కూడా యాదృచ్ఛికంగా ఆ విషయం తెలిసిందట. ఏదో పనిమీద మలక్‌పేటలో ఉన్న తన స్నేహితుడి ఇంటికి కల్సుకోడానికి వెళ్ళాడట. ఇద్దరూ వాళ్ళింటిముందు నిలబడి మాట్లాడుకుంటున్నప్పుడు కరీం పక్కింటినుంచి బైటికొస్తూ కన్పించాడట. 'ఇదేమిటి కరీం చాచా ఇక్కడున్నాడు' అని ఆశ్చర్యపోతుంటే 'అతను నీకు తెలుసా? ఎందుకలా ఆశ్చర్యపోతున్నావు?' అని అతని స్నేహితుడు అడిగాడట.

'నాకు తెలియకపోవడమేమిటి? మా గల్లీలోనేగా ఉంటారు. ఫాతిమా చాచీనడిగితే కరీంనగర్ వెళ్ళి రెండ్రోజులైందని చెప్పింది. అందుకే ఆశ్చర్యం' అన్నాడట.

'ఫాతిమా చాచీ ఎవరు?' అని అతని మిత్రుడు అడిగాడట.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Yedari+Pulu**

* * *